పాలిథిన్ భూతం

- విచ్చలవిడిగా వినియోగంతో ప్రమాదం
- చోద్యం చూస్తున్న అధికారులు
- నిషేధంపై చర్యలు తీసుకోని వైనం



టెక్కలి మేజర్ పంచాయతీలో పాలిథిన్ నిల్వలు



టెక్కలి:

ప్లాస్టిక్ మానవాళి మనుగడకు ముప్పుగా మారుతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రతి అవసరానికీ పాలిథిన్ వినియోగం ప్రస్తుతం సర్వసాధారణమైపోయింది. దీంతో కాలుష్యం అమాంతం పెరుగుతోందని, దీనివలన భవిష్యతలో విపరీత పరిణామాలు తప్పవని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. టెక్కలి మేజర్ పంచాయతీలో రోజురోజుకూ విచ్చలవిడిగా పాలిథిన్ వినియోగంతో బహిరంగ ప్రదేశాల్లో పాలిథిన్ నిల్వలు పేరుకుపోతున్నాయి. పాలిథిన్ నిషేధంపై గతంలో పలుమార్లు ఉన్నతాధికారులు ప్రయత్నాలు చేసినప్పటికీ, ఎందుకో ఆచరణలో మాత్రం దిగువ స్థాయి అధికారులు వైఫల్యం చెందుతున్నారు. పాలిథిన్ వినియోగం వలన కలిగే దుష్ప్రయోజనాలపై పూర్తిస్థాయిలో చైతన్యం కల్పించలేకపోతున్నారు. ఇళ్లల్లో వినియోగించిన పాలిథిన్ కవర్లు బహిరంగ ప్రదేశాల్లో విచ్చలవిడిగా పడేయడం పక్కన పెడితే, వివిధ వ్యాపార దుకాణాల్లో వినియోగించిన పాలిథిన్ కవర్లను రాత్రి వేళల్లో బహిరంగ ప్రదేశాలు, ప్రధాన కూడళ్లలో కుప్పలుగా పడేస్తున్నారు. మరో వైపు తడిచెత్త, పొడి చెత్తను వేరు చేసి అందులో పాలిథిన్‌ను చిన్నపాటి ముక్కలుగా చేసే ప్లాస్టిక్ సెగ్రిగేషన్ యంత్రం సక్రమంగా వినియోగించకపోవడంతో టెక్కలి మేజర్ పంచాయతీలో పాలిథిన్ పేరుకుపోతోంది.



సక్రమంగా వినియోగంలో లేని సెగ్రిగేషన్ యంత్రం

రోజుకు 1 మెట్రిక్ టన్ను చెత్త నిల్వలు

టెక్కలి మేజర్ పంచాయతీలో సుమారు 180కు పైగా వీధులు ఉన్నాయి. ఆయా వీధుల్లో సుమారు 47 వేలకు పైగా జనాభా ఉన్నారు. పంచాయతీలో రోజుకు సుమారు 1 మెట్రిక్ టన్ను చెత్తను సేకరిస్తున్నారు. ఇందులో అత్యధికంగా పాలిథిన్ నిల్వలు ఉండడం గమనార్హం. ఈ చెత్త సేకరణ విషయంలో 9 మంది రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికులు, 40 మంది కాంట్రాక్ట్ సిబ్బంది, 17 మంది గ్రీన్ అంబాసీడర్లు, చెత్త సేకరణకు 3 ట్రాక్టర్లు, తడిచెత్త, పొడిచెత్త సేకరణకు ఒక వ్యాన్, 8 రిక్షాలు ఉన్నాయి. పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణకు నెలకు సుమారుగా రూ.14 లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నారు.

ప్రజల్లో చైతన్యం రావాలి



పాలిథిన్ వినియోగం తగ్గించే విషయంలో ప్రజల్లో చైతన్యం రావాలి. ముఖ్యంగా పంచాయతీ పరిధిలో వ్యాపారస్తులు ఆలోచన చేయాలి. వినియోగించిన పాలిథిన్‌ను పంచాయతీ సిబ్బందికి అప్పగించే విధంగా చూడాలి. వీలైనంత మేరకు నిషేధిత పాలిథిన్ వినియోగించకుండా ఉండాలి. పంచాయతీ పరిధిలో వీధుల్లో చెత్త సేకరణ కోసం కొత్తగా సుమారు రూ.22 లక్షల విలువైన 25 పెద్ద డస్ట్‌బిన్‌లు వచ్చాయి. వాటిని వీధుల్లో ఏర్పాటు చేస్తాం. పాలిథిన్ సేకరణ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

– జి.వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి, టెక్కలి

క్లుప్తంగా

ఆరోగ్య శిక్షణకు ఆహ్వానం

కాశీబుగ్గ: స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఈనెల 22 నుంచి జూలై 3వ తేదీ వరకు యోగా, ధ్యాన, ఆరోగ్య శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి కళింగ కోమటి సంక్షేమ సంఘం సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సంపూర్ణ ఆరోగ్యానికి, పరిపూర్ణ వ్యక్తిత్వానికి ఈ యోగా శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పలాస–కాశీబుగ్గ జంట పట్టణ వాసులకు గొప్ప అవకాశం అన్నారు. యోగా గురువు శ్రీరామ్ గురూజీ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకు హాజరవ్వాలనుకునే వ్యక్తులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

జానపద కళాకారుడికి సత్కారం



ధనుంజయరెడ్డిని సత్కరిస్తున్న మహిళలు, గ్రామస్తులు

ఇచ్ఛాపురం రూరల్: ప్రముఖ జానపద కళాకారుడు, కోలాటం గురువు తిప్పన ధనుంజయరెడ్డిని బొడ్డబాళీ గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. స్థానిక కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆస్థానంలో ధనుంజయరెడ్డి స్థానిక మహిళలకు, బాలికలకు గత కొన్ని రోజులుగా కోలాటంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గురువారం కళాకారులు, గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, టి.బరంపురం సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

టెక్కలి: మండలంలోని రావివలస విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు చేపడుతున్న దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ జి.శంకర్రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి టౌన్–1, కె.కొత్తూరు, రావివలస, లింగాలవలస, తలగాం, బన్నువాడ, టెక్కలి టౌన్–2, విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయం ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పరామర్శ



మోహనరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ యశోద

సోంపేట: పట్టణ పరిధిలోని చౌక ధరల దుకాణం డీలర్ వూనా మోహనరావు ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబాన్ని జెడ్పీటీసీ తడక యశోద, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు గురువారం పరామర్శించారు. వారితో పాటు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

కాశీబుగ్గ: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వాకర్స్ క్లబ్ సభ్యులు అన్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పలాస కేటీ రోడ్డుకు ఆనుకుని ఉన్నటువంటి ముత్యాలమ్మ కోనేరు(నెహ్రూపార్క్)లో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు, పరిసర ప్రాంతీయులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



శరత్‌బాబుకి అభినందనలు తెలుపుతున్న కళాశాల సిబ్బంది

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా చింతాడ శరత్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. మందస జూనియర్ కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కళాశాల అధ్యాపక సిబ్బంది పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలియజేశారు.

సోంపేట: బారువ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పి.సౌజన్య గురువారం బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళం బాలికల జూనియర్ కళాశాలలో కామర్స్ అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఆమెకు కళాశాల అధ్యాపక సిబ్బంది అభినందనలు తెలిపారు.

షాపుల వేలంపాట ఖరారు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి మెయిన్ రోడ్డులోని ఆరు పాత పంచాయతీ కార్యాలయం షాపులు, హాస్పిటల్ రోడ్డులోని నాలుగు కార్డుస్టాండ్‌లో షాపులకు ఈనెల 13వ తేదీన నిర్వహించిన వేలంపాటను మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఖరారు చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో షాపుల వేలంపాటకి సంబంధించిన అంశంపై మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మున్సిపాలిటీకి ఈ షాపుల ద్వారా ఆదాయం పెరిగినట్లు మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. దీంతో ఈ వేలంపాటను ఖరారు చేసినట్లు కౌన్సిల్ తెలిపింది. వీటిలో రెండు రిజర్వ్‌డ్ కేటగిరికి చెందిన షాపుల విషయంలో పాటదారులు తక్కువగా రావడంతో మున్సిపాలిటీకి ఆదాయం కొంచెం తగ్గిందని, ఈ షాపుల ఆదాయం పెరిగేలా పునరాలోచన చేయాలన్నారు. వేలంపాట పాడుకున్న లబ్ధిదారులే ఆయా షాపుల్లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేలా చూడాలని కౌన్సిలర్ బచ్చు జగన్ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, వైస్ చైర్‌పర్సన్ లాబాల స్వర్ణమణి, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో ప్రయోజనం



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కంచిలి: జీడితోటలో అంతరపంటగా నవధాన్యాల సాగుతో అదనపు ప్రయోజనం పొందవచ్చని ఏపీ సీఎన్‌ఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ అన్నారు. మండలంలోని బొగాబెణి గ్రామంలో రైతు పోరి కృష్ణారావుకు చెందిన జీడి తోటలో వరుసల పద్ధతిలో నవధాన్యాల ఆర్‌డీస్ విత్తనాలు కోసం ఒక ఎకరాలో 11 రకాల విత్తనాలు వేసే ప్రక్రియను గురువారం చేపట్టారు. ఈవిధంగా వేయడం వలన లాభంతోపాటు మన ప్రాంతానికి అనువైన విత్తనాలను తయారు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. వాతావరణ పరిస్థితులు, తెగుళ్లను తట్టుకునే దేశివాళీ విత్తనాలు తయారవుతాయని చెప్పారు. దీనిలో భాగంగా బీజామృతంతో విత్తన శుద్ధి చేసి, ఘన జీవామృతం వేసుకొని వరుసల పద్ధతిలో విత్తనాలు వేయించారు. మండల వ్యవసాయాధికారి కొంకేన సురేష్ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంతో భావితరాలకు మంచి భూమి, మంచి ఆరోగ్యం వస్తుందని వివరించారు. అదేవిధంగా ఇలా చేయడం వలన అధిక దిగుబడులతో పాటు నాణ్యమైన పంటను తీసుకోవచ్చన్నారు. రైతులు తమకున్న ఎకరాలో కనీసం 30 సెంట్లు ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ గోవిందరెడ్డి, ఎంటీ సూర్యనారాయణ, వీపీఏ రాజేష్, ఎంటీ సంజీవ్, మండల యాంకర్ టి.శివానందం, ఐసీఆర్పీలు విజయలక్ష్మి, భవానీ, మాజీ సర్పంచ్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దువ్వాడ శ్రీధర్ జన్మదిన వేడుకలు



దువ్వాడ శ్రీధర్‌ను సత్కరిస్తున్న అభిమానులు

కాశీబుగ్గ: పలాస పీఏసీఎస్ మాజీ చైర్మన్, పలాస షిరిడీ సాయి సంస్థాన్ ట్రస్టు చైర్మన్ దువ్వాడ శ్రీధర్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పలాసలోని ఆయన స్వగృహంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభిమానులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు మధ్య కేక్ కట్ చేశారు. కార్మిక వర్తక సంఘాల ప్రతినిధులు, పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లోని ఆయన అభిమానులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు రాజకీయాల్లో ఉంటూ ప్రజాసేవలో తనదైన ముద్రను వేసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, నాయకులు గొర్లె వేణుగోపాల్, కూన హేమాచలం, దువ్వాడ నవీన్‌కుమార్ చౌదరి, చేపర వేణుగోపాల్, వరిశ భాస్కరరావు, డొక్కరి రాజారావు, షాహుకారి నాగేశ్వరరావు, బద్రి సీతమ్మ, మల్లా లక్ష్మణరావు, సప్ప రమణ, ఆటో యూనియన్ అధ్యక్షుడు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళాలు



విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

కంచిలి: మండలంలోని ఎస్ఆర్‌సీపురం ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి పలువురు దాతలు విరాళాలు అందజేశారు. పాఠశాల ఆవరణలో గురువారం ఉదయం జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు దీవెన రాణి అధ్యక్షతన విద్యాకానుక కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జగదీష్ పట్నాయక్ పాఠశాలకు అవసరమైన సౌండ్ సిస్టమ్‌ను కొనుగోలు చేయడానికి రూ.10 వేలు అందజేయగా, కిల్లంశెట్టి మోహనరావు పిల్లలందరికీ 50 నాప్‌కిన్స్ అందజేశారు. గుడియా శ్రీను ఐడీ కార్డులు అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో హెచ్ఎం, సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెరటి తోటలతో లాభాలు



విత్తనాల ప్యాకెట్లు అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: పెరటి తోటలతో అధిక లాభాలు పొందవచ్చని సెర్ప్ ఏపీఎం ఎస్.ప్రసాదరావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలకు ఉద్యానవన శాఖ వారు అందించిన 13 రకాల విత్తనాల ప్యాకెట్లను గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం పోషణ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి వద్ద కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

వజ్రపుకొత్తూరు: ఖరీఫ్ రైతులకు అందుబాటులో ఉంచిన వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బమ్మిడి ధనుంజయరావు కోరారు. మండలంలోని 18 రైతుసేవ కేంద్రాల్లో 608 క్వింటాళ్ల వరి విత్తనాలు ఉంచామని, అందులో స్వర్ణ రకం 238 క్వింటాళ్లు, సాంబ 158 క్వింటాళ్లు, 1061 రకం 109 క్వింటాళ్లు, 1224 రకం 102 క్వింటాళ్లు ఉన్నాయన్నారు. ఇప్పటికే కొంతమేర విత్తనాలు పంపిణీ జరిగిందని తెలిపారు. ఇంకా అవసరమైన రైతులు తమ ఆధార్ కార్డును తీసుకుని రైతుసేవ కేంద్రాల వద్దకు వెళ్లాలని సూచించారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న పైడి కూర్మారావు

మందస: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు సూచించారు. మండలంలోని చీపి పంచాయతీలో సర్పంచ్ సవర లక్ష్మిప్రియ అధ్యక్షతన డిప్యూటీ ఎంపీడీవో వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన జన జాతీయ గౌరవ వర్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గిరిజన గ్రామాల్లో ప్రతీ కుటుంబం కూడా ఆరోగ్యం, విద్య, పారిశుద్ధ్యంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు, ఉపాధి హామీ పథకం, ఐసీడీఎస్, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



ఇచ్ఛాపురం రూరల్: వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ రామారావు దంపతులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బొడ్డబాళీ గ్రామంలో జరుగుతున్న కల్యాణ వేంకటేశ్వస్వామి ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు దంపతులు భక్తిశ్రద్ధలతో గురువారం పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నందిగాం: మండలంలోని పెంటూరు, నరేంద్రపురం గ్రామాల మధ్య ఉన్న రెయ్యి బోడెమ్మ తల్లి ఆలయ 11వ వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు, హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నామని వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బోరు పనులు ప్రారంభం

టెక్కలి: మండలంలోని చింతలగార గ్రామంలో మంచినీటి బోరు పనులను గురువారం ప్రారంభించారు. సర్పంచ్ పి.సుకన్య ఆధ్వర్యంలో బోరు పనులను చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మోహన్, నాయకులు ఎం.దమయంతి, పి.రాజారావు, ఎం.సింహాచలం, పి.మన్మథరావు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యం

- ట్రాన్స్‌ఫార్మర్ ఒరిగిపోయి రోజులు గడుస్తున్నా సరిచేయని వైనం



ఒరిగిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

టెక్కలి: విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యంతో సరఫరా నిలిచిపోయి రోజులు గడుస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై వినియోగదారులు మండిపడుతున్నారు. టెక్కలి–తెంబూరు రోడ్డులో వలియాసాగరం గ్రామానికి ఎదురుగా ప్రభానందా గ్యాస్ ఏజన్సీ సమీపంలో ఉన్న 40 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కొద్ది రోజుల క్రితం కిందకు ఒరిగిపోయింది. ఈ విషయాన్ని చుట్టుపక్కల చిన్నపాటి పరిశ్రమలు నిర్వహిస్తున్న వ్యాపారస్తులు విద్యుత్ శాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అయితే సమస్య పరిష్కరించకపోగా హెచ్‌టీ లైన్‌లో త్రీఫేస్‌తో ఉన్న లైన్‌ను తప్పించి సింగిల్ ఫేస్‌గా లైన్ కలిపేశారు. అయితే మరోసారి స్థానికంగా ఉన్న పరిశ్రమల నిర్వాహకులు అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ యథాస్థానంలో ఏర్పాటు చేయాలంటే మీరే సొంతంగా జేసీబీ ఏర్పాట్లు చేసుకోవాలని సలహా ఇచ్చినట్లు బాధిత వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సమస్య పరిష్కారం కాకుండా 25 రోజులు గడచిపోయాయి. దీని వలన స్థానికంగా ఉన్న చిన్నపాటి పరిశ్రమల నిర్వాహణ నిలిచిపోయింది. పట్టణంలో ఒక వైపు లోఓల్టేజీ సమస్యతో వినియోగదారులు అవస్థలు పడుతుండగా, మరో వైపు శాఖాపరంగా పరిష్కరించాల్సిన సమస్యలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో విద్యుత్ శాఖాధికారుల పనితీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ

- అవస్థలు పడుతున్న ప్రజలు



పూడిక, బురదను తొలగిస్తున్న యువకులు

మందస: మందస మండల కేంద్రంలోని ప్రధాన వీధిలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. డ్రైనేజీ సగం వరకు మాత్రమే నిర్మాణం చేపట్టడంతో వీధి మధ్యలో నుంచి మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో బురద నిలిచిపోతోంది. ఫలితంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యాలయానికి ఎన్నిసార్లు వినతులు సమర్పించినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. మురుగునీరు నిలిచిన ప్రదేశంలో ఇరువైపులా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, బీఎస్ఎన్ఎల్ టవర్లు ఉన్నాయి. దీనివలన వీధుల్లో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మురుగునీరు వలన దోమలు, ఈగలు వ్యాప్తిచెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అందువలన అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిష్కారం జరగడం లేదు



గత కొన్నేళ్లుగా వీధిలోని ప్రజలంతా ఈ సమస్యతో బాధపడుతున్నాం. ఎంత మంది అధికారులకు చెబుతున్నా పరిష్కార మార్గం చూపడం లేదు. మా కుటుంబంలో చాలామంది ప్రస్తుతం జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రజా సమస్యపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణం.

– గుజ్జు సీతమ్మ, బోయివీధి, మందస

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



మందస ప్రధాన వీధిలోని కాలువ సమస్యను ప్రభుత్వం దృష్టికి ఇదివరకే తీసుకెళ్లడం జరిగింది. తక్షణమే తాత్కాలిక ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తాం. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా నిధులు కేటాయించి ప్రధాన వీధిలో కాలువ, అడ్డువాస వీధి కాలువ పనులు పూర్తి చేయడం జరుగుతుంది.

– బమ్మిడి నవీన్ కుమార్, ఈవో

పట్టించుకోవడం లేదు




ప్రధాన బోయివీధిలో మురుగు నీటి సమస్యపై పలుమార్లు అధికారులకు వినతులు అందించినా పట్టించుకోవడం లేదు. కొద్ది రోజుల్లోనే చేస్తామని చెబుతున్నారు.. కానీ చేసిన దాఖలాలు కనిపించడం లేదు. చిన్నారులు మలేరియా, డెంగీ జ్వరాల బారిన పడుతున్నారు. అందువలన అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి.

– గుజ్జు ప్రసాద్ బోయివీధి, మందస

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వక్తలు పేర్కొన్నారు. జిల్లాలోని పలుచోట్ల యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాసనాలు గురువారం వేశారు. అలాగే ప్రజలకు యోగాపై అవగాహన కల్పించారు. ప్రతిరోజూ యోగా సాధన చేయాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం: అలయన్స్ క్లబ్ అధ్వర్యంలో యోగాసనాలు



ఇచ్ఛాపురం రూరల్: ధర్మపురం ఉన్నత పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు



సోంపేట: బారువలో మానవహారం చేపట్టిన విద్యార్థులు